సాక్షి సూర్యాపేట


బుధవారం ׀ 7 ׀ ఆగస్టు ׀ 2024



పథకం ప్రకారమే..
జాటోతుతండాకు చెందిన దివ్యాంగు రాలు రమను పథకం ప్రకారం ప్రియుడే హత్య చేసినట్లు డీఎస్పీ రవి తెలిపారు. - 8లో



రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక
యాదాద్రి జిల్లాలోని పలువురు చేనేత కార్మికులు కొండా లక్ష్మణ్‌బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. - 8లో



పులిచింతల గేట్లు ఎత్తివేత
పులిచింతల ప్రాజెక్టు నుంచి తొమ్మిది గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. - 8లో

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, స్నేహభావంతో పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్ శ్రీ,, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె. సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, సీనియర్ , జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్తమ పీపీగా కొంపల్లి లింగయ్య



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పీపీ లింగయ్య

చివ్వెంల : ఉత్తమ పీపీగా సూర్యాపేట జిల్లా కోర్టు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డీజీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రం అందుకున్నారు. మోతె పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలిని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు పడటంలో చురుకుగా వ్యవహరించినందుకు ఆయనను ఎంపిక చేశారు. సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఆయనను అభినందించారు.

డీఐఈఓగా భానునాయక్



భానునాయక్

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈఓ)గా నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.భానునాయక్‌ను నియమించారు. ఈమేరకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన నల్లగొండ జిల్లా చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చారు. అయితే ప్రస్తుతం పని చేస్తున్న డీఐఈఓ జానపాటి కృష్ణయ్య కంటే భానునాయక్ సీనియర్ కావడంతో ఆయనను డీఐఈఓగా నియమించారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. డీఐఈఓగా భానునాయక్ నియామకం పట్ల తెలంగాణ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్.కృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గునగంటి వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

అధికారుల తప్పిదానికి రైతులను బలిచేయవద్దు

గరిడేపల్లి: రుణమాఫీ విషయంలో బ్యాంకులు , ప్రభుత్వ అధికారులు చేసిన తప్పులకు రైతులను బలిచేయవద్దని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువు కెనరా బ్యాంక్ ఎదుట రైతులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులు రుణమాఫీ కాక ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ చేయించి అర్హులైన రైతుల రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కీసర చిన్న వెంకయ్య, కొల్లయ్య, శ్రీనివాస్, శంభిరెడ్డి, పోకల ఆంజనేయులు, చంద్రారెడ్డి, ఆర్తి వెంకన్న, పోకల సాంబయ్య పాల్గొన్నారు.



కల్మలచెరువు బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

22 గేట్లు.. పది అడుగులు

వచ్చిన వరద వచ్చినట్టే దిగువకు విడుదల

నాగార్జునసాగర్: ఎగువ నుంచి సాగర్ ప్రాజెక్టుకు వరద మరింత పెరిగింది. దీంతో వచ్చే వరదనంతా 22 క్రస్ట్‌గేట్లను పది అడుగులపైకి ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం రాత్రి 20 గేట్లు ఐదు అడుగుల మేర ఎత్తిన అధికారులు మంగళవారం మరో రెండు గేట్లు తెరిచి మొత్తం 22 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు నీటిమట్టం 585.40 అడుగుల(298.5890)కు చేరడంతో క్రమంగా గేట్ల ఎత్తు పెంచారు. నీటిమట్టం 585 అడుగుల వద్ద స్థిరంగా ఉంచుతూ.. అదనంగా వచ్చే వరదనంతా దిగువకు వదులుతున్నారు. నాగార్జున సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050టీఎంసీలు). సాగర్‌కు ఇన్‌ఫ్లో 3,54,076 క్యూసెక్కులు ఉంది. సాగర్ క్రస్ట్‌గేట్ల నుంచి 3,07,758 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 28258 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కుడి కాలవ్కు 8,067 క్యూసెక్కులు, ఎడమ కాలవ్కు 8,193 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీకి 1800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 3,54,076 క్యూసెక్కులు ఉంది.

తరలివస్తున్న పర్యాటకులు

కృష్ణమ్మ పరవళ్లను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. సాగర్‌డ్యాంపైకి అనుమతి లేకపోవడంతో డ్యాం దిగువన కృష్ణాతీరం వెంట ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం వరకు బారులుతీరారు. స్పిల్‌వే మీద నుంచి దుముకుతున్న కృష్ణమ్మను చూసి పరవశించిపోతున్నారు. గంటల తరబడి ఆ పరవళ్లను చూస్తూ గడుపుతున్నారు. సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ జాం అవుతున్నందున పోలీసులు పర్యాటకుల వాహనాలను కొత్త బ్రిడ్జి వద్దే నిలిపివేస్తున్నారు.

డౌన్‌పార్కుకు లాంచీస్టేషన్

లాంచీ స్టేషన్‌ను విజయవిహార్ అతిథిగృహం సమీపం నుంచి డౌన్ పార్కుకు మార్చారు. గతంలో ఇక్కడే ఉండగా వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. విజయవిహార్ వెనుకభాగంలో నూతనంగా నిర్మించిన లాంచీ జట్టీ నుంచే లాంచీలను నడుపుతూ విజయవిహార్ వద్ద టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా ఇక్కడి నుంచే నడిపారు. తిరిగి లాంచీ స్టేషన్‌ను డౌన్‌పార్కుకే మార్చారు.



వావ్ సూపర్ : కృష్ణమ్మ అందాలను సెల్ ఫోన్‌లో బంధిస్తున్న యువతి

పాలనురగ : సాగర్ 22 క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

'మధ్యాహ్నం'పై ధరాభారం

పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలతో సతమతం

- నెలల తరబడి బిల్లులు రాక ఇబ్బందులు
- పెండింగ్‌లో రూ. 50లక్షల బిల్లులు
- అప్పు చేసి వండిపెడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు



ఈ ఫొటో చూడండి. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న ఏజెన్సీ మహిళలు వీరు. 500 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంట చేసి ఎదుతున్న వీరికి ఆరు నెలల నుంచి కూరగాయలు, కిరాణ సరుకుల బిల్లులు రావడం లేదు. నెలకు రూ.50వేల వరకు వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టి వంట చేస్తున్నారు. గౌరవ వేతనాలు కూడా సమయానికి రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సూర్యాపేటటౌన్ : మధ్యాహ్న భోజన పథకంపై పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఆకాశాన్నంటుతున్న రేట్లకు తోడు బిల్లులు సకాలంలో రాక వంట ఏజెన్సీలు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆరునెలలుగా బిల్లులు, గౌరవవేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.50లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆరు నెలలుగా రాని బిల్లులు..

మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు ప్రభుత్వం నుంచి ప్రతీ పాఠశాలకు సివిల్ సప్లయ్‌శాఖ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తారు. పప్పుచారు, ఆకు కూరలు, వారానికి మూడు కోడిగుడ్లు మొదలైన ఖర్చులు వంట చేసేవారు పెట్టుబడిగా పెట్టాలి. జిల్లాలో ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే 52 వేల మంది విద్యార్థులకు పాఠశాల పనిదినాల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలి. ఇందుకోసం 1 వ తరగతి నుంచి 5 వ తరగతి విద్యార్థులకు కుకింగ్ చార్జీల కింద ఒక్కొక్కరికి రూ.5.40, 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు రూ.7.17, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.9.95 చొప్పున చెల్లిస్తారు. వారానికి మూడు గుడ్లు అందించాలి. గుడ్డుకు రూ.5 ఇస్తారు. గత విద్యా సంవత్సరం జనవరి నుంచి ఏప్రిల్ వరకు 9, 10 తరగతుల బిల్లులు, ఈ విద్యా సంవత్సరం జూన్, జూలై నెలలకు సంబంధించి మొత్తం బిల్లులు ఇంకా విడుదల కాలేదు. మొతం రూ.50లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

పెరిగిన ధరలతో ఇబ్బందులు

జిల్లాలో 886 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు 1,638 మహిళా ఏజెన్సీలు ఉన్నాయి. ఏ కూరగాయ అయినా కిలోకు రూ.60కి పైగా రేటు ఉంది. కోడి గుడ్డు ధర బయట మార్కెట్‌లో రూ.7 ఉండగా ప్రభుత్వం చెల్లించేది రూ.5మాత్రమే. అదనంగా రూ.2 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ధరల పెరుగుదలతో ఏజెన్సీ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ మహిళలకు ఒక్కొక్కరికి నెలకు గౌరవ వేతనం రూ. 1000 అందజేస్తారు. వీరికి ఆరు నెలలుగా ఈ వేతనాలు రావడంలేదు.

నెలకు రూ.50వేల వరకు అప్పుతెస్తున్నాం



బిల్లులు సకాలంలో రాక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం కూరగాయలు, పప్పుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో నెలకు రూ.50వేల వరకు అప్పు తెచ్చి పెడుతున్నాం. మాకు నెలల తర్వాత బిల్లులు రావడంతో అవి వడ్డీలకే సరిపోతున్నాయి. ప్రతి నెలా బిల్లులు వచ్చేలా చూడాలి.

– మంగమ్మ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళ, సూర్యాపేట

సకాలంలో బిల్లులు చెల్లించాలి



కూరగాయలు, కోడి గుడ్ల ధరలు పెరిగాయి. దీంతో ఎక్కువ రేటు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా సకాలంలో బిల్లులు చెల్లించాలి. నెల నెలా బిల్లులు రాకపోవడంతో వడ్డీలకు తెచ్చి మరీ పెడుతున్నాం.

– పి.లక్ష్మమ్మ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళ, సూర్యాపేట

బిల్లులు వెంటనే వచ్చేలా చూస్తాం



గత విద్యా సంవత్సరం జనవరి నుంచి ఏప్రిల్ వరకు 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించిన బిల్లులు రావాలి. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల బిల్లులు వచ్చాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి రెండు నెలల బిల్లులు త్వరలో వస్తాయి.బిల్లులు వెంటనే వచ్చే విధంగా చూస్తాం.

– అశోక్, డీఈఓ

మాది ప్రజా ప్రభుత్వం

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్ : 'మాది ప్రజా ప్రభుత్వం' అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గుట్ట వద్ద హౌసింగ్ కాలనీని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. హుజూర్‌నగర్ పట్టణంలో 2,160 యూనిట్లతో ఇందిరమ్మ ఇళ్ల ప్రాజెక్టును 2013 –14లో తాను కాంగ్రెస్ ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 10 ఏళ్లుగా నిలిపివేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తీసుకొచ్చి ఈప్రాజెక్టును పునరుద్ధరించామన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేసి ఇళ్లులేని నిరుపేదలకు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ఈ పథకం కింద ఒక్కో నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అనంతరం ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ వర్క్‌షాప్ నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కాంట్రాక్టర్ మదన్ పాల్గొన్నారు.



అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ వర్క్‌షాప్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

తిరుమలగిరికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరికి నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. ఈమేరకు మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యారు. దీనికి సంబంధించిన జీఓ కాపీని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మంగళవారం హైదరాబాద్‌లో తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత ప్రజల కల అని అన్నారు. గతంలో 1990 డిసెంబర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం శంకుస్థాపన జరిగినప్పటికీ కళాశాల ఏర్పాటు కాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాంత ప్రజల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేసిందన్నారు. జూనియర్ కళాశాల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే సామేల్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

జయశంకర్ సార్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



కలెక్టరేట్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత, అధికారులు

- అదనపు కలెక్టర్ బీఎస్ లత

భానుపురి (సూర్యాపేట) : జయశంకర్ సార్‌ను యువత, ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ సిద్ధాంతకర్త కొత్తపల్లి జయశంకర్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలు, విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలు, సమావేశాల్లో తెలంగాణ రణనినాదాన్ని వినిపించిన పోరాట శీలి అని అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు హేమమాలిని, శ్రీలత, పద్మారావు, జిల్లా అధికారులు శంకర్, కిషన్, లత, నర్సింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిరు నక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి తిరు నక్షత్ర వేడుకల్లో భాగంగా తిరువీధిలో పురఫాట్ సేవోత్సవం మంగళవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధిలో ఊరేగించారు. వేడుకల్లో అర్చకులు, వేద పండితులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

చేనేత.. కష్టాల కలబోత

- నిలిచిపోయిన చేనేత మిత్ర. నేతన్నకు చేయూత పథకాలు
- నూలు సబ్సిడీకి మంగళం
- పేరుకుపోయిన రూ.30 కోట్లు విలువజేసే వస్త్ర నిల్వలు

నేడు జాతీయ చేనేత దినోత్సవం



సాక్షి, యాదాద్రి: చేనేత కార్మికులకు మళ్లీ చిక్కులు మొదలయ్యాయి. చేనేత మిత్ర, నేతన్నకు చేయూత పథకాలు నిలిచిపోయాయి. నూలు సబ్సిడీకి మంగళం పాడారు. పోచంపల్లి ఇక్కత్‌కు ప్రింటెడ్ చీరలు ముప్పుగా మారాయి. అసలైన ఇక్కత్ చీరల అమ్మకాల మార్కెట్ పడిపోయింది. టెస్కోలో కొనుగోళ్లు లేక కోట్ల రూపాయలు విలువ చేసే వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. మాస్టర్ వీవర్స్ కార్మికులకు చేతినిండా పని ఇవ్వలేకపోతున్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుల దయనీయ స్థితిపై ప్రత్యేక కథనం.

టెస్కో నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో..

టెస్కో నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.30 కోట్లు విలువజేసే చేనేత వస్త్రాలు పేరుకుపోయాయి. చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద సుమారు పేరుకుపోయిన నిల్వలతో పరిశ్రమలో తీవ్ర సంక్షోభం నెలకొంది. పోచంపల్లి టై అండ్ డై పట్టు చీరలకు ప్రింటెండ్ చీరలతో ముప్పు పరిణమించింది. పోచంపల్లి చీరల పేరుతో పాలిస్టర్ చీరలను మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీంతో వాటి అమ్మకం తగ్గడంతో మాస్టర్ వీవర్లు చీరల తయారీని తగ్గించారు. చీరలు నేసే కార్మికులకు చేతినిండా పని లేకుండా పోయింది.

త్రిఫ్ట్ బకాయిలు రూ.14 కోట్లు

జిల్లాలో 6671 జియో ట్యాగింగ్ కలిగిన మగ్గాలు ఉన్నాయి. వీటిపై ఆధాపడి జీవనం సాగిస్తున్న చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు కలిపి మొత్తం 11,099 మంది త్రిఫ్ట్ పథకంలో చేరారు. వీరిలో 5,333 మంది వీవర్స్ ఉండగా, 4558 మొదటి అనుబంధ కార్మికులు, 1208 మంది రెండో అనుబంధ కార్మికులు ఉన్నారు. వీరంతా నెలకు సుమారు రూ.1.80 కోట్లకు పైగా తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. అయితే జమ చేసిన డబ్బులకు రెండింతలు ప్రభుత్వం గత 8 నెలలుగా చెల్లించకపోవడంతో రూ.14 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. చివరగా ప్రభుత్వం జిల్లాలో గత ఏడాది సెప్టెంబర్‌లో త్రిఫ్ట్ డబ్బులు జమచేయగా, పోచంపల్లి చేనేత కార్మికులకు నవంబర్ వరకు డబ్బులను ఖాతాలో జమ చేసింది.

చేనేత మిత్రకు మంగళం

అప్పటి ప్రభుత్వం ఎన్నికల ముందు నేరుగా జియో ట్యాగింగ్ కలిగిన మగ్గాల కుటుంబాల కోసం తెచ్చిన చేనేత మిత్ర రెండు నెలలు మాత్రమే ఉంది. మగ్గం నేసే కార్మికుడికి రూ.2వేలు, అనుబంధ కార్మికుడికి రూ.1000 లు మొత్తం రూ.3వేలు ఇచ్చారు. ఎన్నికల తరువాత ప్రభుత్వం మారడంతో ఈ పథకం అమలు కావడం లేదు. అదేవిధంగా చేనేత కార్మికులకు ప్రభుత్వం గుంట మగ్గాల స్థానంలో రూ.37వేల వ్యయంతో ఫ్రేమ్ మగ్గాలు అందజేస్తామని చెప్పింది. ఈమేరకు వివరాలు సేకరించి జిల్లాలో 3500 గుంట మగ్గాలున్నట్లు గుర్తించారు. అయినా ఇంత వరకు అవి అందించలేదు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్: సంపులోని నీటిని విద్యుత్ మోటారు ద్వారా తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట మండలం జాటోతుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోజ్యతండాలో మంగళవారం జరిగింది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోజ్యతండాకు చెందిన వాంకుడోతు నాగునాయక్(32), లలిత దంపతులు సుతారీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం వర్షం రావడంతో ఇంటి దగ్గరే ఉన్నారు. ఇంట్లోని సంపులో ఉన్న నీటిని తీద్దామని విద్యుత్ మోటారుతో నీరు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై నాగునాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

భువనగిరి రూరల్: పత్తి చేనుకు రసాయన మందులు పిచికారీ చేసి అస్వస్థతకు గురైన వ్యవసాయ కూలీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. వివరాలు.. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం అందులగూడెం గ్రామానికి చెందిన కొరనే తిరుపతి(36) కుటుంబ సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి వలస వచ్చాడు. అదే గ్రామానికి చెందిన పొలిశెట్టి ప్రవీణ్ వద్ద వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పత్తి చేనులో రసాయన మందులు పిచికారీ చేసిన తిరుపతి ఇంటికి రాగానే వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సుల బుకింగ్‌పై 10శాతం రాయితీ

నల్లగొండ రూరల్: శుభకార్యాలు, వివాహాలకు ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు బస్సులను ముందస్తుగా బుక్ చేసుకుంటే పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజలంతా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఉండొద్దు



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి : గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు లేకుండా చూడాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం నాంపల్లి మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతుండగా.. మద్యం సేవించిన కొందరు వ్యక్తులు గొడవ చేశారు. గ్రామంలో బెల్ట్ దుకాణాలు బంద్ కాలేదని కొందరు మహిళలు ఎమ్మెల్యేకు చెప్పడంతో ఆగ్రహించిన ఆయన స్థానిక నాయకులు, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి నిధుల కోసం వచ్చే నాయకులు ముందుగా ఆ గ్రామంలో బెల్ట్ దుకాణాలు బంద్ చేయించాలని సూచించారు. బెల్ట్ షాపులు మూసివేయకుండా ఏ నాయకుడూ నాకు ఫోన్ చేయవద్దని స్పష్టం చేశారు. పోలీసులు బెల్ట్ దుకాణాలపై దాడులు చేయాలని.. నాయకులు ఎవరైనా పైరవీలు చేస్తే వారి పేర్లు తనకు చెప్పాలని పోలీసులకు సూచించారు.



ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ : తెలంగాణ-ఆంధ్ర ప్రాంతాలను కలిపే బ్రిడ్జి కింద నుంచి ప్రవహిస్తున్న నీరు



సాగరం.. పాల సంద్రం : 22 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు



వాహనాల బారులు : సాగర్ ప్రాజెక్టు దిగువన వాహనాల రద్దీ



వినోదం.. విహారం : సాగర్ వద్ద ఫొటో దిగుతున్న పర్యాటకులు



తమ్ముడూ స్మైల్ : సెల్ఫీ దిగుతున్న చిన్నారులు



ఇటు రావద్దు : డ్యాం వద్ద పహారా కాస్తున్న కేంద్ర బలగాలు



మళ్లీ ఎప్పుడు చూస్తామో : ప్రాజెక్టు దగ్గర నుంచి నీటి విడుదలను చూస్తున్న పర్యాటకులు



షికారుకెళ్దాం : లాంచీలో వెళ్తున్న ప్రయాణికులు



జలధారల కనువిందు : ఎత్తిపోతల జలపాతం వద్ద పర్యాటకుల సందడి

ఫొటోలు: సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి బంధువుల ఆరోపణ



మానస (ఫైల్)

రామన్నపేట: కాన్పు అయిన రోజే రక్త స్రావం కావడంతో బాలింత మృతి చెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కంకల పద్మ (మంజుల)–ఐలయ్య దంపతుల రెండో కుమార్తె మానస (26)ను నాలుగేళ్ల క్రితం మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన కొల్లు మహేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. మహేష్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారికి శ్రీశైనిత అనే మూడేళ్ల పాప ఉంది. మానస రెండోసారి గర్భం దాల్చగా.. రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో నెలనెలా పరీక్షలు చేయించుకుంటోంది. ఈ నెల 4వ తేదీన కాన్పు కోసం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. సోమవారం ఉదయం 11గంటల సమయంలో వైద్యులు మానసకు ఆపరేషన్ చేసి కాన్పు చేయగా.. ఆడబిడ్డ పుట్టింది. అదే రోజు సాయంత్రం నుంచి మానసకు రక్తస్రావం కావడంతో బీపీ పడిపోయి పరిస్థితి విషమించింది. రాత్రి 8గంటల సమయంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగానే మానస మృతిచెందింది. మానస మృతదేహాన్ని బంధువులు రాత్రి రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు తీసుకొచ్చారు.



రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మానస కుటుంబ సభ్యులు, బంధువులు

న్యాయం చేయాలని ఆందోళన..

వైద్యులు నిర్లక్ష్యమే మానస మృతికి కారణమంటూ బంధువులు మానస మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉంచి రాత్రంతా ఆందోళన నిర్వహించారు. కలెక్టర్ వచ్చేంత వరకు ఆందోళన విరమించమని, మానస మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి. మల్లయ్యలు భారీ బంధోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల రకు డీసీహెచ్‌ఎస్ చిన్నానాయక్, తహసీల్దార్ లాల్‌బహదూర్, సూపరింటెండెంట్ వీరన్న మంగళవారం ఉదయం ఆస్పత్రికి చేరుకున్నారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని, మానస కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని డీసీహెచ్‌ఎస్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన నిర్వహించారు. మృతురాలి భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మానస మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పాల కోసం తల్లడిల్లిన పసిబిడ్డ

మానస జన్మనిచ్చిన పసిబిడ్డ ఆకలితో అర్ధరాత్రి పాల కోసం ఏడవడం అందరినీ కంటతడి పెట్టించింది. బిడ్డకు పాలు ఇచ్చేందుకు ఒకరిద్దరు బాలింతలు ముందుకొచ్చినప్పటికీ వారి వద్దకు పాపను తీసుకెళ్లడానికి వీలుకాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మెడికల్ షాపులో పాల పౌడర్‌ను తెచ్చి పసిపాప ఆకలి తీర్చారు. మానస అమ్మమ్మ ఊరు రామన్నపేట కాగా.. చదువుకునే రోజుల్లో సెలవుల్లో ఎక్కువగా ఆమె ఇక్కడే గడిపేది. దీంతో మానస మరణవార్త విని స్థానికులతో పాటు బంధువులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి తరలిరావడంతో శోకసంద్రంగా మారింది.

పథకం ప్రకారమే దివ్యాంగురాలి హత్య

- తనకు వచ్చే పెళ్లి సంబంధాలు చెడగొడుతుందని అంతమొందించిన ఆమె ప్రియుడు
- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మండలం జాటోతుతండాకు చెందిన దివ్యాంగురాలు రమాను పథకం ప్రకారం ఆమె ప్రియుడే హత్య చేసినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ రవి సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. సూర్యాపేట మండలం జాటోతు తండాకు చెందిన ధరావత్ లాక్యా, లూది దంపతులకు ఆరుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం. చిన్న కుమార్తె రమ(37) పుట్టుకతోనే దివ్యాంగురాలు. లాక్యా, లూది దంపతులు 30 ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందారు. రమకు వివాహం కాలేదు. తన ముగ్గురు అన్నలు తండాలోనే ఉన్నప్పటికీ పదేళ్ల నుంచి ఆమె ఒంటరిగానే ఉంటూ తనకు వచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. అదే తండాకు చెందిన జాటోతు నరేందర్ అలియాస్ నరేష్‌తో రమకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. తొమ్మిదేళ్లుగా వీరు సహజీవనం చేస్తున్నారు. తనను పెళ్లి చేసుకోమని రమా పలుమార్లు నరేష్‌ను అడగగా అతడు నిరాకరిస్తూ వస్తున్నాడు. ఇదే విషయమై ఇద్దరి మధ్య గత మూడు సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఏడాది క్రితం నరేష్ తన వద్ద డబ్బులు, చెవి దిద్దులు తీసుకున్నాడని రమా తండాలోని పెద్దమనుషులకు చెప్పడంతో పెద్దమనుషులు తీర్మానం చేసి నరేష్ రూ.40వేలు రమకు ఇవ్వాలని, ఒకరితో ఒకరు మాట్లాడుకోవద్దని తీర్మానం చేశారు. వెంటనే నరేష్ రూ.40వేలు పెద్దమనుషుల సమక్షంలో రమకు ఇచ్చాడు. అప్పటి నుంచి నరేష్‌కు వేరే పెళ్లి సంబంధాలు చూస్తుండగా.. రమ ఆ పెళ్లి సంబంధాల వారికి ఫోన్ చేసి చెడగొడుతోంది. రమ తనకు ఆర్థికంగా నష్టం కలిగించడమే కాకుండా తనకు వచ్చే పెళ్లి సంబంధాలను చెడగొడుతుందని, రమ బతికుంటే తనకు పెళ్లి కాదని భావించిన నరేష్ ఆమెను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి రమ ఇంటికి వెళ్లిన నరేష్ ఇంటి వెనకాల దాచుకున్నాడు. రమ మూత్రవిసర్జనకు ఇంట్లోంచి బయటికి రావడంతో నరేష్ వెంటనే వెళ్లి రమను చెంపపై కొట్టడంతో ఆమె కిందపడిపోయింది. వెంటనే ఆమె ముఖంపై కాలుతో తన్ని గొంతు నులమడంతో రమా అక్కడికక్కడే మృతిచెందింది. రమా సోదరుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యాపేట రూరల్ పోలీసులు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సూర్యాపేట మార్కెట్‌లో నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా జరిగిన విషయం చెప్పినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్, సిబ్బంది ఇరుగు బాబు, యాదగిరి, అజ్గర్‌అలీ, ఉమామహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

టెయిల్‌పాండ్ నుంచి లక్షా 64వేల క్యూసెక్కులు విడుదల



టెయిల్‌పాండ్ నుంచి విడుదలవుతున్న నీరు

అడవిదేవులపల్లి : నాగార్జునసాగర్ జలాశయం నుంచి మంగళవారం టెయిల్‌పాండ్‌కు 1,37,249 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,64,437 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. టెయిల్‌పాండ్ దిగువకు నీటి విడుదల చేయడంతో తీర ప్రాంతాలైన చిట్యాల, అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు.

పులిచింతల ప్రాజెక్టు 9 గేట్లు ఎత్తివేత



పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

హుజూర్‌నగర్: చింతలపాలెం మండలంలో కృష్ణానదిపై గల పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం 4 గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా వరద ఉధృతి పెరగడంతో మంగళవారం 9 గేట్లను 2.5 మీటర్లు పైకి ఎత్తి 1,60,326 క్యూసెక్కుల నీటిని దిగువన ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేస్తున్నారు. ఎగువన నాగార్జుసాగర్ నుండి 3,95,056 క్యూస్కెల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 48.77 మీటర్ల మేర నీరు ఉంది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరుగుతూనే ఉంది.

ప్రారంభమైన విద్యుత్ ఉత్పత్తి..



పులిచింతలలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి మంగళవారం ప్రారంభమైంది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో మొత్తం నాలుగు యూనిట్లు ఉన్నాయి. వాటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మొత్తం 120 మెగావాట్లు. కాగా ప్రాజెక్టుకు సాగర్ నుంచి వరద వస్తుండటంతో తొలిరోజు మూడు యూనిట్లను రన్ చేస్తూ 10వేల క్యూసెక్కుల నీటితో 60 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు. మిగిలిన యూనిట్ ట్రయల్‌రన్ వేస్తున్నామని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైన నేతన్నలు

- నేడు హైదరాబాద్‌లో అవార్డులు అందజేత

భూదాన్‌పోచంపల్లి: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరిచే చేనేత కార్మికులకు ఇచ్చే ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ రాష్ట్రస్థాయి అవార్డులకు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఆరుగురు ఎంపికైనట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎండీ కామిల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిజైనింగ్ విభాగంలో భూదాన్‌పోచంపల్లికి చెందిన ఎన్నం మాధవి, చౌటుప్పల్‌కు చెందిన పున్న సత్యనారాయణ, రామన్నపేట మండలం భోగారం గ్రామానికి చెందిన కందగట్ల ఆదినారాయణతో పాటు వీవింగ్‌లో చౌటుప్పల్ మండలం కొయ్యలగూడేనికి చెందిన గడ్డం బాలయ్య, మోత్కూరుకు చెందిన కొప్పుల సత్యనారాయణ, సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన తిరందాస్ సంతోష్‌కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో జరిగే కార్యక్రమంలో వారు ఈ అవార్డులు అందుకోనున్నారు.

ఇక్కత్‌లో నూతన డిజైన్లు రూపొందించి..

చేనేత ఇక్కత్‌లో నూతన డిజైన్లను ఆవిష్కరించినందుకు పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన చేనేత కళాకారిణి ఎన్నం మాధవి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. పదో తరగతి వరకు చదువుకొన్న మాధవి శ్రీరంజన్ సిల్క్ యూనిట్ ప్రతినిధి అయిన తన భర్త ఎన్నం శివకుమార్ సహకారం తీసుకొని 5 రంగులతో కూడిన మర్తాస్‌ఫుల్ డిజైన్ వస్త్రాన్ని తయారు చేసింది. వార్పు మల్బరీ పట్టు, వెఫ్ట్ మల్బరీ స్పన్‌ను వినియోగించి 285 కొయ్యలతో 3 ఆసుల మీద బాడీ కొర(లైట్ గోధుమరంగు), లైట్ పింక్, టర్కిష్ బ్లూ, గ్రే, లైట్ బ్రౌన్ రంగులతో ఫుల్ డిజైన్‌తో కూడిన వస్త్రాన్ని ఆవిష్కరించి అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రం, షీల్డ్‌తో పాటు రూ.25వేల నగదు పురస్కారం అందుకోనుంది. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలను చేస్తానని మాధవి పేర్కొంది.



భూదాన్‌పోచంపల్లి : తాను రూపొందించిన మర్తాస్ ఫుల్ డిజైన్ వస్త్రాన్ని చూపిస్తున్న ఎన్నం మాధవి

తేలియా రుమాల్ వస్త్రంలో 72 డిజైన్లు..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన తిరందాస్ సంతోషకుమార్ ప్రాచీన కళ తేలియా రుమాల్ వస్త్రంలో 72 డిజైన్‌లతో 12 రంగులతో వస్త్రం తయారు చేసి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యాడు. తన సతీమణి సంధ్య, సోదరుడు కృష్ణయ్య సహకారంతో ఈ వస్త్రం తయారు చేయడానికి 20రోజులు సమయంతో పాటు రూ.20వేలు ఖర్చు చేశాడు. సంతోషకుమార్ 19సంవత్సరాలుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్నాడు. గతంలో రెండుసార్లు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అవార్డుకు ఎంపిక కాలేదు. ఈసారి ఎంపికయ్యాడు. తన ప్రతిభను గుర్తించి అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందని సంతోష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం వస్త్రాల మీద జీఎస్టీని తొలగించి, సొసైటీల ద్వారా ప్రభుత్వం వస్త్రాలను కొనుగోలు చేస్తే కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు.



సంస్థాన్ నారాయణపురం: తేలియా రుమాల్ వస్త్రం తయారు చేస్తున్న తిరందాస్ సంతోష్‌కుమార్

సహజ సిద్ధ రంగులతో చీర..

చౌటుప్పల్: మండలంలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు గడ్డం బాలయ్య సహజసిద్ధమైన రంగులను ఉపయోగించి మల్బరీ సిల్క్ చీరను రూపొందించడంతో రాష్ట్రస్థాయి చేనేత అవార్డుకు ఎంపికయ్యారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందని గడ్డం బాలయ్య తెలిపారు.



చీరను తయారుచేస్తున్న గడ్డం బాలయ్య

గ్రాఫ్ డిజైన్లతో ప్రయోగాలు

చౌటుప్పల్: గ్రాఫ్ డిజైన్‌లతో నూతన ప్రయోగాలు చేసే చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు పున్న సత్యనారాయణ ఇటీవల సరికొత్తగా రాజహంస డిజైన్‌కు రూపకల్పన చేశాడు. 120కొయ్యలతో నిలువు టస్సర్ చీరపై గుమ్మడి, రెడ్, ఆనంద, పచ్చ, బ్లాక్ రంగులతో ఏనుగు, ఏనుగుపిల్ల, ఎద్దుల బొమ్మలను డిజైన్‌లో పొందుపరిచాడు. అదేవిధంగా ఆకాశంలో విహరించే రాజహంస, యువరాజు, యువరాణి, ఎగిరే ఏనుగు, నెమళ్లు, రామచిలుకల సమూహంతో చీర తయారుచేయగా.. రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. తనకు అవార్డు దక్కడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.



తాను రూపొందించిన పట్టుచీరను చూపుతున్న పున్న సత్యనారాయణ